## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఒంగోలు సిటీ:** ఒంగోలులోని 33/11 శ్రీగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు ఈ నెల 30వ తేదీ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒంగోలు టౌన్ విద్యుత్ డీఈఈ కె.వి.పాండురంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలు తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కోర్టు సెంటర్, జయరామ్ హాల్ సెంటరు, రాజాపానగల్ రోడ్డు, ఓల్డ్ ఈఆర్వో ఆఫీస్, లేబర్ ఆఫీస్ రోడ్డు, నారాయణ జూనియర్ కాలేజీ, హరే రామ బజార్, సాయిబాబా గుడి ఎదురు, బండ్లమిట్ట పార్వతమ్మ గుడి, పోలేరమ్మ గుడి, ధీరజ్ హాస్పిటల్, కొండయ్య బంకు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

**ఒంగోలు వన్‌టౌన్:** యూనివర్స్ దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఒంగోలు సంతపేటలోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వ్యవస్థాపకుడు కె.రమణయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. దివ్యాంగుల హక్కుల కోసం సాగించే పోరాటానికి మద్దతుగా ఉండాలని కోరారు. ఒంగోలులో దివ్యాంగుల భవన్ ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల ఉపాధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టి.రవికుమార్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, బిల్లా చెన్నయ్య, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శారదా మాత జయంతి



మాట్లాడుతున్న గురుదేవులు, పాల్గొన్న భక్తులు

**ఒంగోలు మెట్రో:** శ్రీ శారదా మాత 172వ జయంతి వేడుకలను ఒంగోలులోని కోర్టు సెంటర్ శాస్త్రి భవనం రెండో అంతస్తులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కడప రామకృష్ణమఠం స్వామీజీ శ్రీ జయగోపాలానంద మహారాజ్ శ్రీ రామకృష్ణ గురుదేవులు ప్రవచనం చేశారు. శారదాదేవి ఆధ్యాత్మిక జీవితాన్ని నేటి ఆధునిక కాలంలో పాటిస్తే అందరూ భగవత్ కృప పొందగలరని అన్నారు. కార్యక్రమంలో మైనంపాటి సాయికుమార్, అడ్వకేట్ శాస్త్రి, ఉమాశంకర్, శంకర్ రెడ్డి, చక్రవర్తి, మనోరమ, రత్నం, శ్రీనివాసరావు, భక్త బృందం పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎల్‌పీ కార్యకర్తలు

**ఒంగోలు వన్‌టౌన్:** కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డి.సుందరం డిమాండ్ చేశారు. ఐఎల్‌పీ పార్టీ 18వ వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలు మంగమూరు రోడ్డులో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీనగర్‌లోని అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ గ్రంథాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జెమిలి ఎన్నికల కుట్రను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎల్‌పీ నాయకులు వరప్రసాద్, డేవిడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్సై

**కొత్తపట్నం:** శ్రీషిరిడీ సాయిబాబా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నూతన క్యాలెండర్లను కొత్తపట్నం ఎస్సై సుధాకర్‌బాబు, కమిటీ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ షిరిడీ సాయిబాబాను భక్తులు దర్శనం చేసుకున్నారు. నూతన క్యాలెండర్లను అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యర్రనేని వెంకటసుబ్బారెడ్డి, సాయిబాబా మందిరం చైర్మన్ కూరపాటి ప్రకాశరావు, సెక్రటరీ వసంతవరపు నారాయణ, ట్రెజరర్ యచ్చా ఆంజనేయులు, వైస్ చైర్మన్ కోటా వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో పదిలం



సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్



పేర్నమిట్ట ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్

- ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు
- మారిన సిలబస్, పరీక్ష విధానం, మెళకువలు సూచిస్తున్న టీచర్లు
- ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి

**సంతనూతలపాడు:**

ప్రతి విద్యార్థికి జీవితంలో ఎదగడానికి పదో తరగతి తొలిమెట్టు. ఇక్కడ ప్రతిభ చూపితే జీవితానికి భరోసా గ్యారంటీ అనేలా సాధన చేస్తారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు ఈసారి సిలబస్ మారడంతో కాస్త తడబడుతున్నారు. దీంతో విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మారిన సిలబస్ దృష్ట్యా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు కొరత ఉండడంతో సర్దుబాటు చేసి పాఠాలు బోధిస్తున్నారు. ఇప్పటికే వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలిస్తున్నారు. సంతనూతలపాడు మండలంలో 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 379 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 242 మంది బాలురు, 137 మంది బాలికలు ఉన్నారు.

**గణిత సూత్రాలపై పట్టుముఖ్యం..**

గణిత పాఠ్యాంశాల్లోని సూత్రాలపై పట్టు సాధిస్తే ఎక్కువ మార్కులు సాధించేందుకు వీలుంటుంది. విశ్లేషణాత్మకంగా రాయండని అడిగితే సూత్రాలతో వివరించాల్సి ఉంటుంది. సూత్రాలు, త్రిభుజాలను ప్రత్యేకంగా బాగా నేర్చుకోవాలి. వాస్తవ సంఖ్యల నుంచి సమితి నిర్మాణ రూపం, రోస్టర్ రూపంలోకి మార్చడం వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. నిష్పత్తుల సమస్యలు సాధించడం, పటం ఘన పరిమాణం, ఉపరితల వైశాల్యం కనుక్కోవడం, రేఖీయ సమీకరణాలను సాధించడం, అంకశ్రేణి లేదా గుణశ్రేణి నుంచి ప్రాథమిక సమస్యలు, సాంఖ్యకశాస్త్రం నుంచి కొన్ని ప్రాథమిక సమస్యలపై ప్రశ్నలు ఇస్తారు.

**సాంఘిక శాస్త్రం సులువే..**

సాంఘిక శాస్త్రంలో చరిత్రను అర్థం చేసుకుని, రాజుల పాలన గుర్తుంచుకుని, ప్రపంచ, దేశ చిత్రపటంపై పట్టు సాధిస్తే అధిక మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. భారతదేశ ప్రధాన భౌగోళిక స్వరూపాలు, పర్యావరణ ఉద్యమాలు, నేలలు రకాలు, వ్యవసాయ పద్ధతులు, చరిత్రలో జాతీయోద్యమాలు, జాతీయాదాయం, తలసరి ఆదాయం జల వనరులు, సంస్కృతి, ఆధునికత, ప్రపంచీకరణ వాటి పరిణామాలు, భారత ఆర్థిక వ్యవస్థ వివిధ రంగాలు వంటి అంశాలపై పట్టు సాధించాలి. ప్రపంచపటం, భారతదేశపటం గుర్తించేటప్పుడు సెక్షన్, మ్యాప్ ప్రశ్న నంబర్‌ను స్పష్టంగా రాయాలి. రాజ్యాంగం మౌళిక లక్షణాలపై పట్టు పెంచుకోవాలి.

**జీవశాస్త్రం గంటన్నర..**

ప్రశ్నాపత్రం ఒక్కటే అయినప్పటికీ జవాబుపత్రాలు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం వేర్వేరుగా ఇస్తారు. వివిధ వ్యవస్థలకు సంబంధించి డాక్టర్‌ను అడగాల్సిన ప్రశ్న ఒకటి ఇచ్చే అవకాశం ఉంది. ఆయుర్వేద మొక్కలు, వాటి ఉపయోగాలపై ప్రశ్న ఉంటుంది. అవయవ దానం, రక్తదానం, బాల్య వివాహాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, చెట్ల సంరక్షణ ముఖ్యం. ముఖ్యంగా గుండె, నిర్మాణం ఫలదీకరణ విధానంపై దృష్టి పెట్టాలి.

**హిందీపై ప్రత్యేక శ్రద్ధ..**

హిందీ పలకడం వచ్చినా రాయడం సాధన చేస్తే సులువుగా ఉంటుంది. వ్యాకరణ నిత్యం అభ్యాసం చేయాలి. పరిచయాలు నేర్చుకోవాలి. గద్య భాగంలోని రచయితల పరిచయాలు సాధన చేయాలి. ఆధునిక పద్యభాగ సారాంశాలు నిత్యం చదవాలి. పద్య భాగ సారాంశాలు నేర్చుకోవాలి. వ్యాకరణ దోషాలు లేకుండా రాస్తే మార్కులు ఎక్కువగా సాధించవచ్చు.

**ఆంగ్లమంటే ఆందోళనే వద్దు**

ఆంగ్లమంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆంగ్ల పుస్తకంలోని గ్రామర్ బాగా నేర్చుకోవాలి. లాంగ్వేజ్ స్కిల్స్ మెరుగుపరుచుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

> **వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ:**
>
> 
>
> వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించేలా చూస్తున్నాం. ప్రతి ఉన్నత పాఠశాలలో సబ్జెక్టుకు కనీసం ఒక్కరైనా సబ్జెక్టు ఉపాధ్యాయుడు ఉండేలా ఉపాధ్యాయుల సర్దుబాటు చేశారు. స్టడీ మెటీరియల్‌ను ప్రతి పాఠశాలకు రెండు కాపీల చొప్పున ఉచితంగా అందజేశాం. విద్యార్థుల్లో పరీక్షలంటే ఉండే భయాన్ని పోగొట్టడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
>
> డి.వెంకారెడ్డి, ఎంఈఓ-1, సంతనూతలపాడు

## జగనన్నకు, బూచేపల్లికి కృతజ్ఞతలు



బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మకి పుష్పగుచ్ఛం అందిస్తున్న దుంపా రమణమ్మ, దుంపా చెంచిరెడ్డి

**చీమకుర్తి:** వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా తనను నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు దుంపా రమణమ్మ కృతజ్ఞత తెలిపారు. సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డితో కలిసి ఆదివారం చీమకుర్తిలోని బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టారని, రానున్న రోజుల్లో పార్టీలో మహిళలు చురుకుగా పనిచేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, దుంపా యలమందారెడ్డి, తన్నీరు మోహన్‌రావు, కుంచాల లక్ష్మణ్, వల్లెపు శ్రీను పాల్గొన్నారు.

## బూటకపు కుల గణనను రద్దు చేయాలి



ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వెంకట్రావు, వెంగళరావు

**చీమకుర్తి:** మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోకుంటే మాలల ఎమ్మెల్యేలను బహిష్కరిస్తామని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. చీమకుర్తిలోని అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం స్థానిక మాల మహానాడు, మాల ఉద్యోగుల సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మాల, మాదిగల బూటకపు సోషల్ ఆడిట్‌ను రద్దు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను రద్దు చేయాలన్నారు. అనంతరం స్థానికంగా చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిసి మాల మాదిగల సోషల్ ఆడిట్‌ను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలల ఉద్యోగుల సంఘం నాయకుడు బండ్ల డేవిడ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాల ఉద్యోగులు, మాల మహానాడు సంఘం నాయకులు దారా అంజయ్య, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, వేమా బాలకోటేశ్వరరావు, తుమ్మా ప్రభాకర్, మట్టిగుంట రామాంజులు, పిల్లి కోటేశ్వరరావు, జగన్నాథం మురళి, స్థానికులు పాల్గొన్నారు.

## సంతోషంతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిద్దాం

- జన విజ్ఞాన వేదిక పిలుపు



జేవీవీ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఒంగోలు టౌన్:** నూతన సంవత్సరాన్ని మద్యం మత్తులో ఆహ్వానించకుండా స్నేహితులు, సన్నిహితులతో కలిసి సంతోషంగా స్వాగతం చెబుదామని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక ఎల్‌బీజీ భవనంలో జేవీవీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జేఈవీ సీనియర్ నాయకుడు ఏవీ పుల్లారావు జమిలి ఎన్నికలు-విష పరిణామాలు అనే అంశం మీద మాట్లాడారు. జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టని విమర్శించారు. దేశ ప్రజలను సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ జమిలి జపం చేస్తోందని మండిపడ్డారు. జేవీవీ రాష్ట్ర కమిటీ నాయకుడు యు.భాస్కర్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ప్రతి రెండు నెలల కోసారి నిర్వహిస్తున్న దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపును జనవరి 5వ తేదీ నిర్వహిస్తారని తెలిపారు. నగరంలోని నిరుపేద మధ్యతరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో నగరంలో నిర్వహించనున్న ప్రకాశం బాలోత్సవంను జయప్రదం చేయాలని జేవీవీ గౌరవ సలహాదారులు కె.సుబ్రహ్మణ్యాచారి పిలుపునిచ్చారు. సమావేశంలో జేవీవీ నాయకులు సీహెచ్ జయప్రకాష్, మాలకొండారెడ్డి, షేక్ బషీరున్నిసా బేగం, బాలూ నాయక్, ఉమామహేశ్వరి, జగదీశ్వరి, దార్ల శ్రీను, ఆర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు మారుపేరు.. బాలవికాస్ విద్యార్థులు

- శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు



ర్యాలీలో పాల్గొన్న బాల వికాస్ విద్యార్థులు

**ఒంగోలు మెట్రో:** సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరని శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు కొనియాడారు. సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన 'విలువల కోసం నడక' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి సేవా సమితి, ఒంగోలు బాలవికాస్ విద్యార్థులచే స్థానిక మంగమూరు రోడ్డు జెడ్పీ కాలనీలోని సత్యసాయి సమగ్ర విద్యా కేంద్రం వద్ద నుంచి లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరం వరకు వాక్ ఫర్ వాల్యూస్ ర్యాలీ నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థులంతా సత్యసాయిబాబా వారు ప్రబోధించిన మానవతా విలువలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ సూక్తుల ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో మానవతా విలువలు మృగ్యమైపోతున్న సమయంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మానవతా విలువలను బాల్యం నుంచే నేర్పాలని, సమాజంలో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని బాలవికాస్‌ను 50 సంవత్సరాల క్రితమే స్థాపించారని నల్లమోతు బాల పద్మావతి తెలిపారు. అప్పటి నుంచి ఆధ్యాత్మిక, సామాజిక, తదితర అంశాల్లో విద్యాబోధన చేస్తున్నారన్నారు. కోడెల శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలవికాస్ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న మానవతా విలువలను సమాజానికి తెలియజెప్పాలనే ఉద్దేశంతో సత్యసాయి సేవా సంస్థల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 29న విలువల కోసం నడక ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ పతాకం చేతబట్టి విద్యార్థులు ముందు నడవగా, బాలవికాస్ గురువులు, సత్యసాయి యూత్, సమితి పెద్దలు వెంట నడిచారు. ఒంగోలు ఎంఈఓ తిరుపతి కిషోర్‌బాబు ర్యాలీని ప్రారంభించారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పూసపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వడ్డేవోలు బాలాజీ, కారంశెట్టి పుష్పలత, చిలకల సుహాసిని, తాళ్లూరి హనుమాన్ ప్రసాద్, ఎంవీఆర్కే ప్రసాద్, పేర్ని సాయికృష్ణ, యశ్వంత్ సాయి, సాయియూత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కబ్జాకోరుల నుంచి దళితుల భూములు కాపాడాలి



డొంక భూముల్లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**ఒంగోలు టౌన్:** నగరంలోని మామిడిపాలెం డొంక భూములను కబ్జా చేస్తున్న చంద్రశేఖరశర్మను కఠినంగా శిక్షించాలని, నిరుపేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను కబ్జా నుంచి కాపాడాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత దళితులతో సీపీఎం నాయకులు డొంక భూముల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మామిడిపాలెం డొంకభూములను 35 ఏళ్ల క్రితం 120 మంది నిరుపేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. అయితే, ఈ భూమికి దక్షిణాన ఉన్న రిజిస్టర్ భూములకు చెందిన బడాబాబులు ఈ భూములపై కన్నేశారని చెప్పారు. చంద్రశేఖర్‌శర్మ ఈ భూములను ఆక్రమించుకోవడమే కాకుండా తహసీల్దార్, పోలీసులను మేనేజ్ చేసి బాధిత దళితులను బెదిరింపులకు గురిచేస్తున్నాడని చెప్పారు. ఈ విషయంపై ఈ నెల 23వ తేదీ గ్రీవెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 15 రోజుల్లో బాధితులకు న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆమె ఆదేశించారన్నారు. కానీ, నేటికి వారం రోజులు గడుస్తున్నప్పటికీ మున్సిపల్ కమిషనర్‌నా భూములవైపు తొంగిచూడలేదని తెలిపారు. ఒకవైపు వర్షం కురుస్తున్నప్పటికీ కబ్జాదారుడైన చంద్రశేఖర్ మాత్రం ఈ భూముల్లో పిల్లర్లు నిర్మిస్తున్నాడని చెప్పారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి డొంక భూములు ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగేంత వరకు సీపీఎం అండగా ఉండి పోరాడుతుందన్నారు. కబ్జాదారుల కుట్రలను తిప్పికొట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.సురేష్, షేక్ జబ్బార్, చిటితోటి దానియేలు, సన్నబోయిన వీరబ్రహ్మం, రాచూరి మోహనరావు, కొలంబతి సత్యవతి, మోటుపల్లి హైమావతి, కలువకోలు పద్మ, ఎస్డీ హుసేన్, బీవీ రావు, షుకూర్, చేపల శివ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా మాస శివరాత్రి పూజలు



పాపాకాలనీలో ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరస్వామి

**ఒంగోలు మెట్రో:** మార్గశిర మాసం ఆదివారం చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా శివాలయాల్లో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక లాయరు పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగానికి, కేశవస్వామిపేటలోని కాశీవిశ్వనాథుని దేవాలయంలో, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వరస్వామికి, అంజయ్య రోడ్డులోని సాయిశివ పంచముఖ క్షేత్రంలో, కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్‌లో హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, బాలాజీరావుపేటలోని దుర్గామల్లేశ్వరస్వామికి, గాంధీనగర్‌లో రామలింగేశ్వరస్వామికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి విశేష పూజలు చేశారు. సమతానగర్‌లోని సాగర్ కాలువ దగ్గర దుర్గామల్లేశ్వరస్వామికి, పాపాకాలనీలోని దుర్గామల్లేశ్వరస్వామికి, ఆలయ అర్చకులు అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. శివునికి ప్రీతికరమైన బిల్వదళాలతో శివ అష్టోత్తర పూజా క్రతువులను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ శ్రీనివాసరావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

**కొత్తపట్నం:** జిల్లాలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి పరిసరాలను, లోపల ప్రతి గదినీ పరిశీలించారు. అనంతరం విలేకర్లతో డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సూచనల మేరకు గత రెండు నెలలుగా సైబర్ క్రైంలపై స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సైబర్ క్రైం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఫోన్ చేసిన సమయంలో మొబైల్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్, బ్యాంక్ ట్రాన్సాక్షన్ ఐడీ నంబర్, ఏ ఫోన్‌లో మాట్లాడుతున్నారో ఆ ఫోన్ నంబర్ జాగ్రత్తగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆలస్యమైన కొద్దీ ఫిర్యాదు నమోదవుతుందిగానీ రికవరీ మాత్రం జరగదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. థర్డ్ పార్టీ వారు కచ్చితంగా ఇన్సూరెన్స్ పొంది ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చెప్పి జరగవని, అనుకోకుండా జరుగుతాయని, మనం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. చిన్నపిల్లలపై అఘాయిత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటివి ఎవరో చేయరని, చుట్టుపక్కల వారే ఇలాంటి వాటికి పాల్పడతారని, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తల్లిదండ్రులకు డీఎస్పీ సూచించారు. గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల జిల్లా ఎస్పీ దామోదర్ కాలేజీలు, పాఠశాలల్లో యువతకు గంజాయి, గుట్కాల నిషేధంపై అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ మేడా శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎస్సై వి.సుధాకర్‌బాబు, రైటర్ రంగనాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ వీల్‌చైర్ అందజేత



ఎలక్ట్రికల్ వీల్ చైర్ అందించిన పూర్వ విద్యార్థులు

**చీమకుర్తి:** పూర్వ విద్యార్థులు రూ.85 వేల విలువైన ఎలక్ట్రికల్ వీల్ చైర్‌ను కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి ఆదివారం అందించారు. చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూలులో 1993-94లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రతి సంవత్సరం కనీసం సేవా కార్యక్రమాలను ఆత్మీయ సమ్మేళనంలో నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. దానిలో భాగంగా మిత్రులందరి సహకారంతో రూ.85 వేలు వసూలు చేశారు. తాళ్లూరు మండలం మాధవరం గ్రామంలో కండరాల క్షీణత కారణంగా పాఠశాలకు సక్రమంగా వెళ్లలేకపోతున్న కె.రవి ప్రకాష్ అనే విద్యార్థికి పాఠశాలకు హాజరయ్యే నిమిత్తం ఎలక్ట్రికల్ వీల్‌చైర్‌ను అందించారు. తొలుత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో తీపి గుర్తులను మననం చేసుకున్నారు. కార్యక్రమం అనంతరం శిద్దా బాలాజీ మిత్రులందరికి జ్ఞాపికలు, బహుమతులు అందించారు. బి.మధు, పోకూరి రామకృష్ణారెడ్డి, ముత్యాల ప్రసాద్, ఏడుకొండలు, ఆంజనేయులు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.